క్లుప్తంగా

ఏరియా ఆస్పత్రికి ఐపీహెచ్ఎల్ మంజూరు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి రూ.1.2 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబరోటరీ (ఐపీహెచ్ఎల్) మంజూరైంది. రాష్ట్రంలో 13 ఐపీహెచ్ఎల్‌లు మంజూరయ్యాయి. ఇందులో పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట ఏరియా ఆస్పత్రికి ఒకటి కేటాయించారు. ఐపీహెచ్ఎల్ ఏర్పాటుతో సాధారణ రక్త పరీక్షలతో పాటు ఇతర పరీక్షలు చేసేందుకు అవకాశం ఉంటుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

సాగునీరు విడుదల



సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం సీతంపేట గ్రామం వద్ద గుమ్మిడిగెడ్డ ప్రధాన కాలువ నుంచి సాగునీటిని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా చూస్తామన్నారు. గుమ్మిడిగెడ్డ రిజర్వాయర్ పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి విరేష్ చంద్రదేవ్, కురుపాం కన్వీనర్ కొండయ్య, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు డిమాండ్స్ డే



జెండా ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

పాలకొండ రూరల్: ఏపీ రైతు సంఘం డిమాండ్స్ డేని పురస్కరించుకుని మండలంలోని కొండాపురంలో ఆదివారం ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు నేతృత్వంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. 1936వ దశకంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం బ్రిటీష్, జమిందారీలపై పోరాడిన నాయకుల త్యాగాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. నాటి నుంచి ఏటా సెప్టెంబర్ 1న 'రైతు డిమాండ్స్ డే'గా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు బలగ దుర్గారావు, కె.రామ్మూర్తినాయుడు, రాయి రామకృష్ణ, ఆనందరావు, తదితరులున్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

గుమ్మలక్ష్మీపురం: సీపీఎస్, జీపీఎస్‌తో పాటు యూపీఎస్ విధానాల్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.సత్య, భగవాన్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సభ్యులు నిరసన చేపట్టారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించకుంటే భవిష్యత్‌లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.హరిగోపాల్, ఎం.భాస్కరరావు, జె.తిరుపతిరావు, టి.సత్యనారాయణ, వై.సూర్యనారాయణ, తదితరులున్నారు.

విద్యార్థికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అఖిల్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పులిగూడ గ్రామానికి చెందిన ఐదో తరగతి విద్యార్థి తాడంగి అఖిల్ ప్రమాదవశాత్తు గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో గ్రామంలోని పాఠశాల ప్రహరీ ఎక్కి ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తలకు బలమైన గాయం తగలడంతో కుటుంబ సభ్యులు వెంటనే భద్రగిరి సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

ఇసుక తరలింపునకు ఏర్పాట్లు

భామిని: మండలంలోని కాట్రగడ–బి ఓపెన్ హెడ్ ఛానల్ సైడ్ వియ్యర్‌లో పేరుకుపోయిన ఇసుక మేటలను తొలగించేందుకు జిల్లా యంత్రాంగం యుద్ధప్రాతిపదికన రెండు రోజులుగా చర్యలు చేపడుతున్నారు. పాలకొండ ఆర్డీఓ కార్యాలయం సిబ్బంది పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. నేరడి బ్యారేజ్ వద్ద ముందస్తుగా చెక్ పాయింట్ ఏర్పాటు చేశారు. ఏబీ రోడ్డు నుంచి నేరడి బ్యారేజీ కేంప్ ఆఫీస్ వరకు పాడైన మట్టి రోడ్డును బాగుచేసి రోలింగ్ చేయిస్తున్నారు. ఇసుక నిల్వ చేసే స్థలాన్ని చదును చేయిస్తున్నారు. అలాగే కాట్రగడ సచివాలయంలో ఇసుక బుకింగ్ కౌంటర్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

రైతన్నా.. ఆందోళన వద్దన్నా..

- అధిక వర్షాలకు నీటమునిగిన పంటపొలాలు
- తెగుళ్లు వ్యాపించే అవకాశం
- సస్యరక్షణ చేపడితే పంట సేఫ్



పట్టణంలో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నదులు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. పంట పొలాలు ముంపునకు గురవడంతో పంట నష్టపోవాల్సి వస్తుందని, దిగుబడిపై ఆ ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో సస్యరక్షణ చేపట్టడం ద్వారా పంటను కాపాడుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో పార్వతీపురం మండలంలో 395.5 మిల్లీమీటర్లు, సాలూరు మండలంలో 131.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ క్రమంలో వరద ముప్పు నుంచి పంటలను ఎలా కాపాడుకోవాలో వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు సూచిస్తున్నారు. రైతుల అసరాల మేరకు యూరియా 3,774 టన్నులు, డీఏపీ 394 టన్నులు రైతు సేవాల కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

వరిలో రక్షణ చర్యలు

- శ్రీధృతి, మారుటేరు సాంబ, సాంబమసూరి, స్వర్ణ, ఇంద్ర, అమర వంటి వంటి రకాలు ప్రస్తుతం చిరుపొట్ట దశలో ఉన్నాయి. పంట దశలను బట్టి రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.
- పెరుగుదల దశలో ఉన్న వరిపైరు నీటి ముంపునకు గురైతే పొలంలో ఉన్న నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలి.
- ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువును పైపాటుగా అధికారుల సూచనల మేరకు వెసుకోవాలి. లేకుంటే (19:19:19) లీటరుకు 5 గ్రాముల వంతున ఎకరాలకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాల్సి ఉంటుంది.
- ప్రస్తుత వర్షాలకు వరిలో పాముపొడ తెగులు ఉధృతి ఎక్కువయ్యేందుకు అవకాశం ఉంది. దీని నివారణకు ప్రోపికోనజోల్ 1 మి.లీ, లేక వాలిడా మైసిన్ 2 మి.లీ, లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి దుబ్బుకి తగిలేలా 15 రోజులు వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- వరిలో అగ్గి తెగులు సోకినపుడు ముదురు ఆకుల పై నూలుకండె ఆకారంలో గోధుమ రంగు మచ్చలు వచ్చి ఆకులు ఎర్రబడతాయి. క్రమేపి మచ్చలు కలిసిపోయి. పంట ఎండిపోయినట్లు కనిపిస్తుంది. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లేదా కాసుగామైసిన్ 2.మి.లీ. మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అగ్గి తెగులు, పొడ తెగులు కలిపి ఆశించినపుడు ట్రైపాక్సిస్ట్రోబిన్+టేబ్యుకోనజోల్ (నేటివో) 0.4 గ్రా. చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వరిలో సుడిదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు బుప్రోఫెజిన్ 1.6 మి.లీ. లేదా ఇసోఫెన్ప్రాక్స్ 2 మి.లీ లేదా ఎసిపెట్ 1.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా థయోమిథోక్సామ్ 0.20 గ్రా. లేదా డైనోటెఫ్యురాన్ 0.25 గ్రా. లేదా ప్రైమైట్రోజన్ 0.6 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



రాజుపేట వద్ద వరి పొలంలో నలిచిన నీటిని బయటకు మళ్లిస్తున్న రైతు

సూచనలు అందిస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. వరి పంట ప్రస్తుతం కీలక దశకు చేరుకుంది. ఈ క్రమంలో తాజా వర్షాలతో పంట నష్టపోకుండా రైతులు రక్షణ చర్యలు చేపట్టాలి. మా సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ క్షేత్ర సహాయకుల సూచనలతో సమస్యలు అధిగమించాలి.

– కె.రత్నకుమారి.
వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, పాలకొండ

అధ్వానంగా రహదార్లు



రహదారి మధ్యలో ఏర్పడిన గుంతలు

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని పాలకొండ-సీతంపేట రహదారి దుస్థితి ఇది. రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి అధ్వానంగా తయారైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తోంది. గుంతలు ఎక్కడ ఉన్నాయో గుర్తించలేక వాహనాదారులు ప్రమాదాలకు గురౌతున్నారు. రహదారికి ఇరువైపులా కాలువలను కప్పేసి ఆక్రమణలు చేశారు. దీంతో నాగావళి 7వ బ్రాంచి కెనాల్ నుంచి వచ్చిన సాగునీరు రహదారి మీదుగా ప్రవహిస్తుంది. ఈ రహదారిలో ప్రయాణం చేయడం అంటేనే నరకం కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత కనీస చర్యలు తీసుకోక పోవడంతో ప్రస్తుతం పరిస్థితి మరింత దారుణంగా మారింది. అధికారులు స్పందించి రహదారి మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన రహదారి

రహదారిపై చెత్తకుప్ప



ఎన్‌కేరాజపురం సెంటర్ వద్ద ప్రధాన రహదారిలో చెత్తపోగు

నగరపంచాయతీ పరిధిలోని ఎన్‌కేరాజపురం సెంటర్ వద్ద చెత్త పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంత ప్రజలు ఇళ్లలోని చెత్తను పారబోసేందుకు ఈ సెంటర్‌లో నగరపంచాయతీ డస్ట్‌బిన్ ఏర్పాటు చేసింది. కానీ అక్కడ వేసిన చెత్తను తొలగించడంలో నగరపంచాయతీ ఉదాసీనతంగా వ్యవహరిస్తోంది. చెత్త మొత్తం రోడ్డుపై చెల్లాచెదురుగా విస్తరించడంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించేవారంతా ముక్కుమూసుకుని ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి చెత్తను అక్కడ నుంచి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

వారధులు కట్టించిన సారథులు

సాలూరు: వర్షం కురిస్తే వందలాది గ్రామాలు జలదిగ్బంధంలోకి వెళ్లిపోయేవి. ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపేవారు. అత్యవసరమ పరిస్థితిలో ధైర్యం చేసి వాగులు దాటేందుకు ప్రయత్నిస్తే ప్రాణాలు పోయేవి. అయితే ఇందంతా 2019కి ముందు పరిస్థితి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కృషితో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పలు ప్రాంతాల్లో వంతెనలు నిర్మించడంతో వరద సమయంలో సురక్షితంగా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో, నియోజకవర్గంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నాటి కష్టాలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.

- సాలూరు మండలంలో చిన్నపాటి వర్షానికే గోముఖి నది కందులపదం వంతెన మీదుగా ఉధృతంగా ప్రవహించేది. దీంతో చుట్టుపక్కల సుమారు 50 గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. 2014–19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలో వంతెన నిర్మాణానికి పలుమార్లు శంకుస్థాపన చేసినా పనులు మాత్రం ప్రారంభించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటి డిప్యూటీ సీఎం రాజన్నదొర సుమారు రూ.5.13 కోట్లు ఆర్అండ్‌బీ నిధులతో వంతెన నిర్మాణం పూర్తిచేసి, ప్రారంభించారు.
- పాచిపెంట మండలంలో మోసూరు వంతెన కాంట్రాక్టర్లకు కామధేనువుగా ఉండేది. వర్షం పడితే అక్కడ వంతెన కోతలకు గురవ్వడం.. లక్షలాది రూపాయలు వెచ్చించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టం.. మళ్లీ వర్షం పడితే అది పాడవ్వడం.. షరా మామూలుగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాజన్నదొర ప్రత్యేక చొరవతో సుమారు రూ.8 కోట్లతో వంతెన నిర్మాణం పూర్తిచేశారు.

గత ప్రభుత్వంలో నిర్మించిన మరికొన్ని వంతెనలు

- సుమారు కోటి రుపాయలతో పాచిపెంట మండలం పద్మాపురం నుంచి ఈతమానువలస మధ్యలో బ్రిడ్జి శ్లాబ్ పూర్తయింది.
- సుమారు కోటి రుపాయలతో కొండమోసూరు – దొరలుద్దండి మధ్యలో బ్రిడ్జి శ్లాబ్ పూర్తయింది.
- సాలూరు మండలం తుండ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి మక్కువ వెళ్లే రోడ్డు మధ్యలో బట్టివలస వద్ద రూ.1 కోటితో బ్రిడ్జి శ్లాబ్ పూర్తయింది.
- సాలూరు, మక్కువ మండలాల మధ్య నంద–తుండ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి సీబిలి మధ్యలో సుమారు కోటి రుపాయలతో నిర్మిస్తున్న బ్రిడ్జి శ్లాబ్ లెవెల్‌లో ఉంది.
- సాంపిగాం, కురుకూటి, ఆలూరు–మోదుగ మధ్య, గుంటబద్ర, లింగాడవలస బ్రిడ్జిలు, నేరెళ్లవలస, వెలగవలస–ములక్కాయవలస బ్రిడ్జి, కాకుల తోట వద్ద, పెదపారన్నవలస వద్ద బ్రిడ్జిలు, కాజ్‌వేలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు కాగా వీటిలో కొన్ని పూర్తయ్యాయి. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి.
- సాలూరు మండలం కందులపదం, బట్టివలస, బైపాస్ రోడ్డు బ్రిడ్జి, పాచిపెంట మండలం మోసూరు బ్రిడ్జి, మాతుమూరు, కుంతాం–తుమ్మిగెడ్డ మధ్య వంతెనల నిర్మాణం గత ప్రభుత్వంలో పూర్తయ్యాయి.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న పీడిక రాజన్నదొర నియోజకవర్గంలో 8 వంతెనలు మంజూరు చేయించడంతో పాటు నిర్మాణాలు పూర్తిచేశారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తయిన కందులపదం వంతెన (ఇన్‌సెట్లో) వంతెన నిర్మాణానికి ముందు కందులపదం పరిసర ప్రాంతాల వరద కష్టాలు(ఫైల్)

ఈ మలుపు ప్రమాదాలకు పిలుపు



పాలకొండ-పార్వతీపురం రహదారిలో అట్టలి వద్ద ప్రమాదకర మలుపు

పాలకొండ రూరల్: పాలకొండ-వీరఘట్టం, పార్వతీపురం వయా ఒడిశా రాయిగడ వెళ్లే అంతరాష్ట్ర రహదారిలో మలుపులు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రాని, ఒడిశా వెళ్లే వాహనాల రద్దీ ఇటీవల బాగా పెరిగింది. దీనికి తోడు విజయనగరం జిల్లా పరిధిలో వంతెనలు దెబ్బతినటంతో లారీల రాకపోకలు ఇదే మార్గంలో జరుగుతున్నాయి. ఈ క్రమంలో మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా మండలంలోని అట్టలి వద్ద రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరగటంతోపాటు మలుపు వద్దనే రహదారి ఛిద్రం కావటంతో వాహనచోదకులు వాటిని గమనించకపోవటం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి చెట్లను తొలిగించటంతోపాటు రహదారికి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి



ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ: పాలస్తీన ప్రజలపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య పిలుపుమేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ శాంతికి అమెరికా, నాటో దేశాల సామ్రాజ్యవాదం విఘాతం కలిగిస్తోందని అన్నారు. ఇప్పటి వరకు 40వేల మంది పాలస్తీన పౌరులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులను అరికట్టి ప్రపంచ శాంతికి చర్యలు తీసుకోవాలని కోరారు. ర్యాలీలో కాద రాము, చింతల శ్రీదేవి, సీహెచ్ సురేష్, సంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆస్పత్రిలో ఉన్న దివ్యకు పింఛన్ అందజేస్తున్న వీఆర్వో రాజేంద్ర

వీరఘట్టం: మండలంలోని దశుమంతపురం గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన ఎం.దివ్యకు నాలుగు రోజుల క్రితం పురిటినొప్పులు రావడంతో వీరఘట్టం పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆమెను రాజాం కేర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించడంతో శనివారం పండంటి పాపకు జన్మనిచ్చింది. పింఛన్ తీసుకునేందుకు గ్రామానికి రాలేని పరిస్థితిలో ఉన్నందున వీఆర్వో జి.రాజేంద్ర ఆదివారం ఆస్పత్రికి వెళ్లి ఆమెకు పింఛన్ అందజేశారు.

నదీ తీర గ్రామాల్లో అప్రమత్తం

జియ్యమ్మవలస: తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కేవీ సీతారామయ్య సూచించారు. నాగావళి నదీతీర గ్రామాల్లో వరద పరిస్థితిని ఆదివారం ఆయన సమీక్షించారు. బాసంగ గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. నదిలో వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రజలు ఎవరూ నదిలో దిగవద్దని కోరారు. వరద ఎక్కువైతే పునరావాస ప్రాంతాలకు తరలిస్తామని, ధైర్యంగా ఉండాలన్నారు.

- కొమరాడ: బంగాళాఖాతంలో ఏర్పాడిన వాయుగుండం ప్రభావంతో నాగవళి, జంఝావతి నదుల్లో నీరు పెరగడంతో ఆయా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమంతా ఉండాలని ఎస్ఐ కె.నీలకంఠం సూచించారు. కళ్లికోట, దుగ్గి, జంఝావతి రబ్బర్ డ్యాం ప్రాంతాలను ఆదివారం ఆయన సందర్శించారు. వర్షాలు, వరదలపై ప్రజలను అప్రమత్తం చేశారు. వరద ఉద్ధృతి పెరిగితే వెంటనే పునరవాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. జంఝావతిలో వరద ప్రవాహం ఉద్ధృతంగా ఉన్నందున ఎవరూ నదిలో దిగవద్దని హెచ్చరించారు.
- వీరఘట్టం: నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరుగుతున్నందున తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. ఆర్ఐ లక్ష్మనాయుడు, ఈఓపీఆర్డీ ఎం.నాగభూషణరావుతో కలిసి ఆదివారం బిటివాడ, పనసనందివాడ, కిమ్మి తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. నదిలో ప్రవాహం పెరుగుతున్నందున ప్రజలు అటువైపు వెళ్లొద్దని, పడవ ప్రయాణాలు చేయొద్దని సూచించారు. వారితో పాటు వీఆర్ఓలు గంట సురేష్‌కుమార్, జి.అప్పలనాయుడు తదితరులున్నారు.
- గరుగుబిల్లి: అల్పపీడన ప్రభావంతో మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, ఉద్దవోలు, రావుపల్లి, ఉల్లిబద్ర, గొట్టివలస తదితర గ్రామాల్లో ఆదివారం ఓమోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వరి, గోగు పంటకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అంటున్నారు. చెరువులు, వాగులలో నీరు చేరడంతో జలకళ సంతరించుకున్నాయి. ఇదిలావుండగా పెద్దూరు, రావుపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని గెడ్డలో వరదనీరు పెరగడంతో పంటలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



వీరఘట్టం: పనసనందివాడ వద్ద నాగావళి నదీ తీరంలో పడవ ప్రయాణాలు చేయొద్దని చెపుతున్న ఎస్సై కళాధర్



జియ్యమ్మవలస: బాసంగి వద్ద నాగావళి నదిలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్



గరుగుబిల్లిలో కురిసిన వర్షం

• ఆకట్టుకుంటున్న ఆడలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో నిర్మించిన ఆడలి వ్యూపాయింట్ పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటుంది. ఇక్కడ నుంచి చూస్తే హిరమండలం రిజర్వాయర్, దానితో పాటు ఆనుకుని ఉన్న గిరిజన గ్రామాలు ఎంతో అందంగా కనిపిస్తాయి. వ్యూపాయింట్ ఏర్పాటుతో ఈ ప్రాంతం పర్యటకంగా ప్రాచుర్యం పొందింది. – సీతంపేట

గుండెపోటుతో హెచ్ఎం మృతి



హెచ్ఎం దన్నాన తిరుపతిరావు(ఫైల్)

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం ఉన్నత పాఠశాలలో హెచ్ఎమ్‌గా పనిచేస్తున్న దన్నాన తిరుపతిరావు గుండెపోటుతో కన్నుమూశారు. సహచర ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతిరావు విజయనగరం తోటపాలెంలో నివాసముంటున్నారు. శనివారం రాత్రి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యు లు చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన స్వగ్రామమైన పాచిపెంటలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. హెచ్ఎం మృతికి ఎంఈఓలు మూర్తి, విజయకుమార్, ఉపాధ్యాయ సిబ్బంది సంతాపం తెలిపారు.

మాజీ డిప్యూటీ సీఎం సంతాపం

పాచిపెంట: నెల్లిమర్ల మండలం పరాస జెడ్పీహెచ్ ఎస్ హెచ్ఎం దనాన్న తిరుపతిరావు మాస్టారు మృతికి మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆదివారం సంతాపం తెలియజేశారు. మాస్టారు స్వగ్రామం పాచిపెంట చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాస్టారు కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.